# కార్యకర్తలకు అండగా బీఆర్ఎస్ : మంత్రి


ఎంపీ నామా, మంత్రి పువ్వాడ సమక్షంలో చేరిన సహకార సంఘం మాజీ అధ్యక్షుడు,


పార్టీలో చేరిన వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న కమల్‌రాజు

మధిర, అక్టోబర్16: రాష్ట్ర మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ సమక్షంలో సోమవారం మధిర బీఆర్ఎస్ పార్టీ జోనల్ స్థాయి బూత్ కమిటీ సమావేశంలో ముదిగొండ సహకార సంఘం మాజీ అధ్యక్షుడు బత్తుల వెంకట్రావు, బోనకల్లు మండలం బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన పలు పార్టీల కార్యకర్తలు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఆయనకు మంత్రి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కార్యకర్తలకు, నాయకులకు బీఆర్ఎస్ పార్టీ అండదండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎంపీ నామా నాగేశ్వరరావు, మధిర నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి లింగాల కమల్‌రాజు, కొండబాల కోటేశ్వరరావు, మధిర మార్కెట్ కమిటీ చైర్మన్ బంధం శ్రీనివాసరావు, బ్రాహ్మణపల్లి సర్పంచ్ జెర్రిపోతుల రవీందర్, గ్రామ అధ్యక్షుడు వంగాల కృష్ణ, ముదిగొండ మండల అధ్యక్షుడు వాచేపల్లి లక్ష్మారెడ్డి, పోట్ల ప్రసాద్, జడ్పీటీసీ పసుపులేటి దుర్గ, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### కమల్‌రాజు సమక్షంలో చేరికలు

మధిరటౌన్, అక్టోబర్16: స్థానిక బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మధిర 21వ వార్డుకు చెందిన కాంగ్రెస్ పార్టీ నుంచి వేల్పుల శివ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ అభ్యర్థి లింగాల కమల్‌రాజు, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారు మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి విజయానికి కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు పల్లపోతుల వెంకటేశ్వరరావు, పట్టణ కార్యదర్శి అరిగె శ్రీనివాసరావు, కౌన్సిలర్ వై.వీ.అప్పారావు, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

### ఎన్నికల ప్రచార సీడీలు విడుదల

మధిర, అక్టోబర్16: మధిర బీఆర్ఎస్ అసెంబ్లీ అభ్యర్థి లింగాల కమల్‌రాజు ఎన్నికల ప్రచార సీడీని రాష్ట్ర మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ సోమవారం విడుదల చేశారు. బోనకల్లు మండలం చిరునోముల గ్రామానికి చెందిన ప్రజా జానపద గాయకుడు చాపలమడుగు కోటేశ్వరరావు రచించి స్వయంగా ఆలపించి రికార్డు చేసిన ఆడియో సీడీని మంత్రి పువ్వాడకు అందజేశారు. దానిని ఆయన లింగాల కమల్‌రాజు సమక్షంలో విడుదల చేసి పాటను సమావేశంలో విని పించి గాయకుడిని అభినందించారు. కార్యక్రమంలో ఎంపీ నామా నాగేశ్వరరావు, నాయకులు కొండబాల కోటేశ్వరరావు, కూరాకుల నాగభూషణం, నల్లమల వెంకటేశ్వరరావు, మొండితోక లత, మెండెం లలిత తదితరులు పాల్గొన్నారు.

### మానవత్వం చాటుకున్న మంత్రి

మధిర, అక్టోబర్16: ఎన్నికల ప్రచారంలో భాగంగా మధిర చేరుకున్న మంత్రి పువ్వాడ మార్గమధ్యమంలో మధిర అంబేద్కర్‌సెంటర్ వద్ద ఓ వ్యక్తిని గుర్తుతెలియని వాహనం ఢీకొని గాయాలయ్యాయి. మంత్రి వెంటనే కారు దిగి తన కాన్వాయిలో మధిర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి మానవత్వాన్ని చాటుకున్నారు. అనంతరం వైద్యులను కలిసి సదరు వ్యక్తికి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు.



మధిర టౌన్ : పార్టీలో చేరిన వారితో కమల్‌రాజు, కొండబాల, మధిర : సీడీ ఆవిష్కరిస్తున్న మంత్రి పువ్వాడ

## బైక్ ర్యాలీలో బీఆర్ఎస్ నాయకులు


బైక్‌ర్యాలీలో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు

ఎర్రుపాలెం, అక్టోబర్16: మధిరలో జోనల్ స్థాయి బూత్ కమిటీ సమావేశం సోమవారం జరిగింది. సమావేశంలో పాల్గొనేందుకు మండలంలోని అన్ని గ్రామాల నుంచి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు భారీగా బైక్‌ర్యాలీతో బయల్దేరి వెళ్లారు. మధిర ఏఎంసీ మాజీ చైర్మన్ చావా రామకృష్ణ, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పంబి సాంబశివరావు ఆధ్వర్యంలో సుమారు వెయ్యి మంది నాయకులు, కార్యకర్తలు బయల్దేరి వెళ్లారు. కార్యక్రమంలో నాయకులు, ప్రజాప్రతినిధులు చావా రామకృష్ణ, పంబి సాంబశివరావు, దేవరకొండ శిరీష, శీలం కవిత, అప్పారావు, బాలరాఘవరెడ్డి, కొండేపాటి సాంబశివరావు, రామకోటయ్య, భాస్కర్‌రెడ్డి, కృష్ణారావు, రవి, శ్రీనివాసరావు, విజయబాబు, పుల్లారెడ్డి, కిషోర్‌బాబు, మదన్మోహన్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, కృష్ణారెడ్డి, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

## వైద్యశిబిరం విజయవంతం


గర్భిణులకు వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ వెంకటేశ్

మధిర, అక్టోబర్16: ఆత్కూరు గ్రామ ఆరోగ్య ఉప కేంద్రంలో మాటూరుపేట పీహెచ్‌సీ వైద్యుడు వెంకటేశ్ ఆధ్వర్యంలో సోమవారం గర్భిణులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరంలో ఆత్కూరు, కృష్ణాపురం, వంగవీడు, వెంకటాపురం, సిరిపురం, మల్లవరం గ్రామాలకు చెందిన గర్భిణులు పాల్గొనగా వారికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ఐరన్ టాబ్లెట్లు, విటమిన్-సీ టాబ్లెట్లు, క్యాల్షియం టాబ్లెట్లు తీసుకుంటూ పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.


ఎర్రుపాలెంలో..

ఎర్రుపాలెం, అక్టోబర్16: శఖునవీడు గ్రామంలో బనిగండ్లపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు వెంకట్‌లాల్, సమీర ఆధ్వర్యంలో సోమవారం వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరంలో జ్వరం, జలుబు, దగ్గు, తలనొప్పి, కీళ్లనొప్పులు, గ్యాస్, షుగర్, బీపీ వంటి వివిధ రకాల వ్యాధులతో బాధపడుతున్న వారిని పరీక్షించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో యరమల భాస్కర్‌రెడ్డి, రామకోటయ్య, సదాశివరావు, లతాశ్రీ, సుధాకర్, భవానీ, శ్రీను, రూప, శ్రావణి, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పులి సంచారం... ప్రజల్లో భయాందోళన

వేంసూరు, అక్టోబర్16: మండలంలోని పులి సంచరిస్తుందంటూ హల్‌చల్‌కావడంతో మండలంలోని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. కుంచపర్తి, కల్లూరుగూడెం, సత్యనారాయణపురం, అమ్మపాలెం గ్రామాల్లో పులి సంచరిస్తుందంటూ సోమవారం మండలంలో దావానలంలా వ్యాపించింది. కుంచపర్తి, కల్లూరుగూడెం గ్రామాల మధ్య రహదారి వెంట వెళ్తున్న వారు చూసినట్లు తెలిసింది. సత్యనారాయణపురం శివారులో పొలాల్లో పులి కాలి జాడలు ఉన్నట్లు కొందరు చెపుతున్నారు. పులి వచ్చిన సమాచారాన్ని ఎస్సై వీరప్రసాద్‌కు కుంచపర్తి గ్రామానికి చెందిన కొందరు ఫోన్ చేసి సమాచారం అందించగా యన అటవీశాఖ అధికారులకు తెలిపినట్లు ఆయన చెప్పారు. దీనిపై ఎఫ్ఎస్‌వోను వివరణ కోరగా తమకు పోలీసుశాఖ నుంచి సమాచారం అందిందని, మంగళవారం ఆయా గ్రామాల్లో ఏమైనా కాలి ముద్రలు దొరుకుతాయామో విచారిస్తామని తెలిపారు.

# భక్తిశ్రద్ధలతో శరన్నవరాత్రి పూజలు


బోనకల్లు : ముష్టికుంట్లలో భక్తుల పూజలు

బోనకల్లు, అక్టోబర్16: మండలంలోని ముష్టికుంట్ల గ్రామంలో ముత్యాలమ్మ సెంటర్ వద్ద భక్తులు ప్రత్యేకంగా లక్ష్మి, సరస్వతి, దుర్గాదేవీ విగ్రహాల వద్ద భక్తులు సోమవారం పూజలు నిర్వహించారు. మండలంలో విగ్రహాల సమీపంలో బతుకమ్మ పండుగ సంబురాలను జరుపుకున్నారు. రకరకాల పూలను సేకరించి బతుకమ్మలను తయారు చేసి మహిళలు, పిల్లలు కోలాటాలు ఆడుతూ బతుకమ్మను సమీప చెరువుల్లో నిమజ్జనం చేశారు.

ఎర్రుపాలెం, అక్టోబర్16: తెలంగాణ తిరుపతిగా పేరు గాంచిన జమలాపురం వేంకటేశ్వరస్వామి ఆలయంలో దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు సోమవారం కొనసాగాయి. ఈ సందర్భంగా అమ్మవారు గాయత్రి దేవీ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయంలో హోమాలు, లలితా సహస్రనామ పారాయణం తదితర పూజలు చేపట్టారు.

మధిరటౌన్, అక్టోబర్16: మధిర పట్టణంలోని శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో దేవీశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రెండోరోజు అమ్మవారు గాయత్రి దేవీ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ముఖద్వారం నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. ఆలయ అధ్యక్షుడు కపిలవాయి జగన్మోహన్‌రావు మాట్లాడుతూ భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశామని తెలిపారు. ఆలయ పూజారీ శేషాచార్యులు ఆధ్వర్యంలో అమ్మవారికి పూజలు నిర్వహించారు.



ఎర్రుపాలెం : హోమంవద్ద పూజలు నిర్వహిస్తున్న అర్చకులు, మధిర టౌన్ : గాయత్రిదేవీ అలంకరణలో అమ్మవారు

## పైప్‌లైన్ నిర్మాణం లేకుండానే తారు రోడ్డు నిర్మాణ పనులు

### ప్రశ్నించిన స్థానికులు


తారు రోడ్డు నిర్మాణ పనులు

కొణిజర్ల, అక్టోబర్ 16: తెలంగాణ సర్కారు కోట్లాది రూపాయలతో రోడ్ల విస్తరణ పనులు చేపట్టిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా కొణిజర్ల, ఏన్కూరు మండలాలను అనుసంధానిస్తూ పల్లిపాడు నుంచి గుబ్బగుర్తి వరకు అయిదేళ్ల క్రితం రెండు జోన్ల పరిధిలో బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. ఇందులో భాగంగా గుబ్బగుర్తి సమీపంలోని పెద్దమ్మగుడి వద్ద కాలువ నీరు వెళ్లేందుకు పైప్‌లైన్ వేసి బీటీ నిర్మాణం చేపట్టారు. ఇటీవల భారీ వాహనాల రాకపోకలతో పైప్‌లైన్ ధ్వంసమైంది. దీంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. కాగా సోమవారం ఆర్ అండ్‌బీ అధికారులు మరమ్మతులు చేపట్టేందుకు వచ్చి పైప్‌లైన్ వేయకుండానే బీటీ రోడ్డు వేస్తుండడంతో స్థానికులు సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. మరో మూడు రోజుల్లో తిరిగి పైప్‌లైన్ వేస్తామని అధికారులు సమాధానం ఇచ్చినట్లు స్థానికులు తెలిపారు.


ధ్వంసమైన పైప్‌లైన్